## టమాటా @ 100



హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 7 : పండుగ పూట ఏం తినేటట్టు లేదు.. ఏం కొనేటట్టు లేదు.. నిత్యావసర వస్తువులతోపాటు కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. కూరల్లో ఎక్కువగా వినియోగించే టమాటా ఏకంగా సెంచరీ కొట్టింది. కిలో ధర ₹100కు చేరింది. మిగతా కూరగాయల ధరలు కూడా అలాగే ఉన్నాయి. దిగుబడి తగ్గడం వల్లనే ధరలు పెరిగాయని, మరో రెండు వారాల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

# ట్రెజరీ కార్యాలయాల అవినీతిపై ఇంటెలిజెన్స్ ఆరా?

- సంచలనం రేసిన 'నమస్తే తెలంగాణ' కథనం
- విచారణకు హైదరాబాద్ నుంచి ఆదేశాలు
- రంగంలోకి దిగిన నిఘా విభాగం అధికారులు
- ఏజీ ఆఫీస్ నుంచే రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల వివరాల సేకరణ
- సోమవారం ఉదయం నుంచే విచారణ
- పూర్తిస్థాయిలో కూపీ లాగుతున్న సదరు ఆఫీసర్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న బాధిత ఉద్యోగులు

**నమస్తే ఎఫెక్ట్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీతోపాటు వేములవాడ సబ్ ట్రెజరీ కార్యాయాల్లో జరుగుతున్న అవినీతి బాగోతంపై సోమవారం 'నమస్తే తెలంగాణ' కథనం సంచలనం రేపింది. మరోవైపు ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీయడంతో అడ్డదారులు తొక్కిన అధికారుల్లో వణుకు మొదలైంది. ఏజీ కార్యాలయం నుంచి తీసుకున్న వివరాలతో సదరు అధికారులు, బాధితులతో నేరుగా మాట్లాడుతున్నారు. ఇప్పటికే కొంత మందితో మాట్లాడగా.. ప్రతి ఒక్కరూ తమకు జరిగిన అన్యాయం, లంచాల వసూలు, కాలయాపనతో పడిన తిప్పలను పూసగుచ్చినట్టు చెప్పడంతోపాటు మరికొంత మంది బాధిత రిటైర్డ్ ఉద్యోగుల వివరాలను సైతం అందిస్తున్నట్టు ఓ అధికారి తెలిపారు. మొత్తంగా ఈ వ్యవహారంలో తీగ లాగితే డొంకంతా కదులుతుండగా.. ఇన్నాళ్లూ ఫైల్ అప్‌లోడ్‌కు నిలబెట్టి వసూళ్లు చేసిన అధికారుల్లో అలజడి రేగుతున్నది.**

కరీంనగర్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలోని పలు ట్రెజరీ, సబ్ ట్రెజరీ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్‌గా మారుతున్నాయి. ప్రధానంగా రిటైర్డ్ ఉద్యోగుల ఫైల్ అప్‌లోడ్ చేసేందుకు ఒక్కొక్కరి వద్ద ₹5వేల నుంచి ₹10 వేల దాకా నిలబెట్టి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా సిరిసిల్ల జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీ, వేములవాడ సబ్ ట్రెజరీ కార్యాలయాలపై ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'అవినీతికి కేరాఫ్‌గా ట్రెజరీ కార్యాలయాలు' శీర్షికన ప్రచురించిన కథనం సంచలనం సృష్టించింది. ప్రధానంగా రెండు ప్రాంతాల ట్రెజరీ ఆఫీసుల్లో పని చేసే ఉద్యోగుల్లో కలకలం రేపింది. ఇన్నాళ్లూ ఫైల్ అప్‌లోడ్ చేసేందుకు నిలబెట్టి వసూళ్లు చేసిన అధికారుల్లో వణుకు మొదలు కాగా, బాధిత ఉద్యోగులు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'నమస్తే తెలంగాణ' ప్రతినిధులను స్వయంగా కలిసి, మీ కథనం నూటికి నూరుపాళ్లు నిజమని చెప్పడంతోపాటు లంచాలు తీసుకోవడమే కాకుండా, ఫైల్ ముట్టేందుకు ముప్పుతిప్పలు పెట్టారని సదరు అధికారుల పేర్లతోసహా చెబుతూ ఆవేదన వ్యక్తం చేశారు. అడిగినంత ఇచ్చినా ఫైల్ అప్‌లోడ్ చేసేందుకు నానా తంటాలు పడ్డామని ఓ ఉద్యోగి వివరించారు.

### రంగంలోకి ఇంటెలిజెన్స్..?

ఓవైపు 'నమస్తే' కథనం అధికారుల్లో వణుకు పుట్టించగా, మరోవైపు ఇంటెలిజెన్స్ అధికారులు వివరాలు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా అధికారులు అందుకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై మొత్తం నిఘా వర్గానికి చెందిన ముగ్గురు అధికారులు రంగంలోకి దిగినట్టు తెలుస్తున్నది. అంతేకాదు, సదరు అధికారులు.. సిరిసిల్ల, వేములవాడ ట్రెజరీ ఆఫీస్‌లపై ప్రత్యేక ఫోకస్ పెట్టినట్టు ఓ అధికారి తెలిపారు. అందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో మార్చి నుంచి పదవీ విరమణ పొంది ట్రెజరీ ద్వారా అప్‌లోడ్ చేసిన రిటైర్డ్ ఉద్యోగుల వివరాలను సదరు అధికారుల బృందం ఏజీ కార్యాలయం నుంచి తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఆ మేరకు సదరు రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి వివరాలు ఆరా తీస్తున్నారు. సోమవారం ఉదయం పది గంటల నుంచే ఈ విచారణ ప్రక్రియ ప్రారంభించినట్టు తెలుస్తుండగా.. విచారణలో బైర్లు కమ్మే నిజాలు బయటకు వస్తున్నట్టు ఓ అధికారి ద్వారా తెలుస్తున్నది. ముందుగా సిరిసిల్లలో ఉన్న ఓ రిటైర్డ్ ఉద్యోగికి ఫోన్ చేయగా.. ఆయన మొత్తం వివరాలు చెప్పి తనతోపాటు ఇబ్బందులకు గురైన, అలాగే లంచాలు సమర్పించుకున్న మరో ముగ్గురు రిటైర్డ్ ఉద్యోగుల పేర్లు ఇచ్చినట్టు సమాచారం. దీంతో సదరు రిటైర్డ్ ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించగా.. వారు కూడా పూసగుచ్చినట్టు వివరించినట్టు తెలుస్తున్నది. లంచాలు ఇవ్వక ముందు పడిన తిప్పలు, ఫైల్ పెడింగ్ పె ట్టిన తీరు, అమర్యాదగా మాట్లాడిన తీరు, లంచా లు ఇచ్చిన తర్వాత కూడా ఫైల్ అప్‌లోడ్ చేయడానికి తీసుకున్న సమయం వంటివి వివరించారని, వాళ్లు చెబుతున్నవి వింటుంటే తామే ఆశ్చర్యానికి లోనవుతున్నామని ఓ అధికారి తెలిపా రు. ఒక రిటైర్డ్ అధికారికి ఫోన్ చేస్తే.. వాళ్లే మరో ఐదు నుంచి ఆరుగురి పేర్లు ఇస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ విచారణ మరో రెండు రోజులపాటు కొనసాగనున్నట్టు తెలిసింది. బాధితుల నుంచి వచ్చే వివరాలతో నివేదికను తయారు చేసి.. విచారణకు ఆదేశించిన అధికారులకు సమర్పిస్తామని, అక్కడి నుంచి ప్రభుత్వానికి, సంబంధిత శాఖలకు తమ రిపోర్టు వెళ్తాయని సదరు అధికారి తెలిపారు. అయితే ఈ వ్యవహారాన్ని ఇక్కడితోనే ఆపేందుకు కొంత మంది ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు రంగంలోకి దిగినట్టు తెలుస్తున్నది. వివరాలు బయటకు వస్తే.. చాలా మందిపై క్రమశిక్షణ చర్యలుంటాయని తెలుసుకొని, ఎలాగైనా సరే విచారణ ముందుకెళ్లకుండా విశ్వప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే బాధితులు మాత్రం తమ వద్ద అకారణంగా వసూళ్లకు పాల్పడిన సిబ్బందిపై వేటు పడాల్సిందేనంటూ తెగేసి చెప్పడం గమనార్హం.

# జర్నలిస్టుల స్థలాలపై గందరగోళం?

- రద్దు చేసినట్టు కలెక్టర్ చెప్పారు : జర్నలిస్టులు
- పండుగ పూట విలేకరుల కుటుంబాల్లో ఆవేదన
- సీరియస్‌గా స్పందించిన బీఆర్ఎస్ నాయకత్వం
- ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- ముఖ్యమంత్రికి బండి సంజయ్ లేఖ
- అండగా ఉండాలని సూచన
- రద్దు చేశామని ఎక్కడా చెప్పలేదని అధికారుల వివరణ



ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవిస్తున్న జర్నలిస్టులు

కరీంనగర్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ జర్నలిస్టులకు ఇచ్చిన ఇండ్ల స్థలాలపై గందరగోళం నెలకొన్నది. కొన్నాళ్లుగా అధికారులు-జర్నలిస్టుల మధ్య అపరిష్కృతంగా ఉన్న ఇంటి స్థలాల సమస్యపై ప్రస్తుతం వివాదం చోటుచేసుకున్నది. గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన స్థలాలను తమకు స్వాధీనం చేయాలని కోరుతూ కొన్నాళ్లుగా జర్నలిస్టులు ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారు. ఇదే సమయంలో తమ సమస్యను పరిష్కరించి, కేటాయించిన స్థలం తమకు స్వాధీనం అయ్యేలా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఇప్పటికే పలుమార్లు కలిసి వినతి పత్రాలు సమర్పించారు. అయితే, రేపూ.. మాపూ.. అని చెప్పారే తప్ప అధికారులు ఈ సమస్యకు పూర్తి పరిష్కారం చూపలేదు. ఈ నేపథ్యంలో సోమవారం జర్నలిస్టులు ప్రజావాణికి వెళ్లి మరోసారి కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి, తమ స్థలాలు తమకు స్వాధీనం అయ్యేలా చూడాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జర్నలిస్టులకు మధ్య కొద్దిసేపు చర్చ నడిచింది. గతంలో కేటాయించిన స్థలాలు ప్రొసీజర్ ప్రకారం లేవని, కనుక రద్దు చేశామని, కొత్తగా వచ్చే నిబంధనలను పరిగణలోకి తీసుకొని ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తామని కలెక్టర్ చెప్పిన మాటలతో కూడిన వాయిస్‌ను జర్నలిస్టులు విడుదల చేశారు. రద్దు అయినట్టు కలెక్టర్ చెప్పడంతో జర్నలిస్టులు ఒక్కసారిగా ఆవేదనకు గురయ్యారు. ఇదే సమయంలో కలెక్టర్ వాయిస్‌తో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం, కలెక్టర్ వాయిస్ బయటకు రావడంతో గతంలో పట్టాలు పొందిన జర్నలిస్టులు ఒక్కసారిగా కన్నీటి పర్యంతమయ్యారు. నోటికాడికి వచ్చిన బుక్కను ఎత్తగొడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను తెలుసుకున్న బీఆర్ఎస్ అధినాయత్వం సీరియస్‌గా స్పందించింది. జర్నలిస్టులపై వివక్ష ఎందుకంటూ ప్రశ్నించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, అలాగే మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం జర్నలిస్టుల పక్షాన నిలిచి, ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. ఈ విషయాన్ని తెలుసుకున్న అధికారయంత్రాగం ఆ తర్వాత జర్నలిస్టు స్థలాలపై వివరణ ఇవ్వాల్సి వచ్చింది. అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ మాట్లాడుతూ, జర్నలిస్టుల స్థలాల రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ ఎక్కడా చెప్పలేదని వివరణ ఇచ్చారు.

### పట్టాలను పునరుద్ధరించాలి : మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌లో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇచ్చిన ఇండ్ల స్థలాల పట్టాలను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 118 మంది జర్నలిస్టులకు ఇచ్చిన నివాస స్థలాల పట్టాలను రద్దు చేస్తున్నట్టు వస్తున్న వార్తలు చాలా బాధాకరమన్నారు. ఇచ్చిన స్థలాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని ఎంతో ఆశతో ఆలోచిస్తున్న తరుణంలో ఇలా చేయడం శోచనీయమన్నారు. వెంటనే ప్రభుత్వ యంత్రాంగం, జిల్లా మంత్రులు పునసమీక్షించి జర్నలిస్టులకు ఇచ్చిన పట్టాలను పునరుద్ధరించాలని కోరారు.

### ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : కేటీఆర్ డిమాండ్



కరీంనగర్‌లో జర్నలిస్టుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలను వెనక్కి తీసుకోవడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యను తీవ్రంగా తప్పుబట్టారు. సమాజ హితం కోసం పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వం స్థలాలను కేటాయించడాన్ని కూడా రేవంత్‌రెడ్డి సర్కారు జీర్ణించుకోలేక పోతున్నదని మండిపడ్డారు. హైదరాబాద్‌లో పేద ప్రజలను ఇళ్లను కూలగొడుతున్నారని, కరీంనగర్‌లో జర్నలిస్టుల స్థలాలను వెనక్కి తీసుకుంటున్నారని, అసలు ఇదేం పాలన అని ఆయన ప్రశ్నించారు. జర్నలిస్టల సంక్షేమం కోసం పనిచేయాల్సిన ప్రభుత్వం, వారికి కేటాయించిన స్థలాలను రద్దు చేయడం సిగ్గు సిగ్గు అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే జర్నలిస్టలపై కక్షగట్టి ఈ చర్యకు పాల్పడ్డారని మండిపడ్డారు. తమకు ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయని సంతోషంలో ఉన్న జర్నలిస్టలకు పండుగ పూట రేవంత్‌రెడ్డి సర్కార్ షాక్ ఇచ్చిందన్నారు. ఈ అన్యాయంపై బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తుందన్నారు. ఈ సంఘటనను రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సంఘాలు ఖండించాల్సిన అవసరముందన్నారు. జర్నలిస్టలకు కేటాయించిన స్థలాల విషయంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### జర్నలిస్టులకు దసరా కానుక ఇదేనా? : మాజీ మంత్రి హరీశ్‌రావు



బీఆర్ఎస్ ప్రభుత్వం కరీంనగర్‌లో 118 మంది జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం శోచనీయమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు అన్నారు. రేవంత్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చే దసరా కానుక ఇదేనా? అని ప్రశ్నించారు. కరీంనగర్ జర్నలిస్టుల ఇంటి స్థలాలను రద్దు చేసినట్టు తెలుసుకున్న హరీశ్‌రావు ఈ విషయాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయ కక్షలో భాగంగానే బతుకమ్మ, దసరా పండుగల వేళ జర్నలిస్టుల కుటుంబాల్లో ఆవేదన మిగల్చడం బాధాకరమన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిత్యం శ్రమించే జర్నలిస్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న దుర్మార్గ వైఖరికి ఇదే నిదర్శనమని స్పష్టం చేశారు. జర్నలిస్టులు, వారి కుటుంబాలకు అన్యాయం చేయవద్దని, ప్రభుత్వం వెంటనే ఇండ్ల స్థలాల రద్దు ప్రకటనను ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

### జర్నలిస్టులకు తీరని అన్యాయం

**సీఎం రేవంత్‌కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి లేఖ**



బతుకమ్మ పండుగ ముందర కరీంనగర్ జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు రద్దు చేసినట్టు తెలిసిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను మీ ప్రభుత్వం రద్దు చేయడం బాధాకరమైన విషయమన్నారు. అన్ని పథకాల్లో మహిళలకే ప్రాధాన్యత ఇస్తామని కాంగ్రెస్ గత ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిందని, సీఎం హోదాలో మీరు, మీ మంత్రివర్గ సహచరులు సైతం ఇదే విషయాన్ని పదేపదే చెప్పారని గుర్తు చేశారు. కానీ, అందుకు భిన్నంగా తెలంగాణలో అతిపెద్ద పండుగలైన విజయదశమి, బతుకమ్మ పండుగ ముందట ఇండ్ల స్థలాలను రద్దు చేసి జర్నలిస్టు కుటుంబాల్లోని మహిళలను తీవ్ర మానసికక్షోభకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని లేఖలో ప్రశ్నించారు. నోటి కాడ ముద్ద లాగేసుకున్నట్టు మీ ప్రభుత్వం అనుసరించిన తీరు శోచనీయమన్నారు. బతుకమ్మ పండుగ ముందు జర్నలిస్టు ఇంట ఆడబిడ్డ కన్నీళ్లు పెట్టే పరిస్థితి మంచిది కాదని సూచించారు. చాలీచాలని వేతనాలతో బతుకు సాగిస్తున్న జర్నలిస్టులకు అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రద్దు చేసిన ఇండ్ల పట్టాలను వెంటనే పునరుద్ధరించడంతోపాటు ఆ స్థలాల్లో డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో మీరు సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నానని లేఖలో స్పష్టం చేశారు.

### వివక్ష ఎందుకు : మాజీ మంత్రి గంగుల



కరీంనగర్ జర్నలిస్టులకు బీఆర్ఎస్ సర్కారు అందించిన డబుల్ బెడ్రూం ఇళ్ల స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. 118 మంది జర్నలిస్టులకు మల్కాపూర్, చింతకుంట గ్రామ శివారులో ఇళ్ల పట్టాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిందని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందన్నారు. జర్నలిస్టుల వివక్ష వద్దని, చిత్తశుద్ధి ఉంటే వారికి ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జర్నలిస్టుల ఇళ్ల పట్టాలపై అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని, ఇళ్ల స్థలాలు ఇప్పించి వాటిని నిర్మించే వరకు పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. కరీంనగర్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై వెంటనే స్పందించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. దసరా పండుగ వేళ ఇళ్ల స్థలాల రద్దు వార్త జర్నలిస్టుల కుటుంబాల్లో ఆవేదనను నింపిందని, ఇది ప్రభుత్వాలకు మంచిది కాదని లేఖలో సీఎంకు సూచించారు. వెంటనే స్పందించి జర్నలిస్టుల పక్షాన నిలువాలని కోరారు. జర్నలిస్టులు కూడా ఆవేదన చెందవద్దని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

### రద్దు చేసినట్టు చెప్పలేదు : అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్

జర్నలిస్టులకు కేటాయించిన స్థలాల ఎన్‌వోసీ కోసం ప్రయత్నం చేస్తున్నామని, ఈ విషయంలో ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాశామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ తెలిపారు. సోమవారం రాత్రి 'నమస్తే తెలంగాణ'తో ఫోన్‌లో మాట్లాడారు. జర్నలిస్టుల స్థలాలు రద్దు చేసినట్టు కలెక్టర్ పమేలా సత్పతి ఎక్కడా చెప్పలేదన్నారు. కేటాయించిన స్థలానికి సంబంధించి ఇంకా ఎన్‌వోసీ రాలేదని, ప్రస్తుతం ఆ ప్రయత్నంలో ఉన్నామని చెప్పినట్టు తెలిపారు. అంతేకాకుండా, వెంటనే ఆ ఫైల్ తెప్పించి, ఎన్‌వోసీ కోసం మరోసారి ప్రభుత్వానికి లేఖ రాయడంతోపాటు సదరు లేఖను జర్నలిస్టులకు ఇవ్వాలని, తద్వారా జర్నలిస్టులు కూడా ప్రభుత్వం వద్ద ఫాలోఅప్ చేసుకోవడానికి ఆస్కారం ఉంటుందని కలెక్టర్ తనను ఆదేశించారని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణి పూర్తయిన వెంటనే మరోసారి ప్రభుత్వానికి లేఖ రాయడానికి ఫైల్ ప్రిపేర్ చేశామని తెలిపారు. అంతే తప్ప ఎక్కడా జర్నలిస్టుల స్థలాలు రద్దు చేసినట్టు కలెక్టర్ మాట్లాడలేదన్నారు.

### ఆందోళన అవసరం లేదు : డీఆర్వో పవన్ కుమార్

జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కరీంనగర్ జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. కరీంనగర్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇచ్చిన 118 పట్టాలకు సంబంధించి ఎస్ఆర్ఎస్పీ భూమి విషయంలో ఎన్‌వోసీ రావాల్సి ఉందని, అందుకోసం ప్రభుత్వానికి లేఖ రాస్తున్నామని ఆయన వివరించారు. ఎన్‌వోసీ రాగానే నిబంధనల ప్రకారం జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. పట్టాలు రద్దు చేసినట్టు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ఆయన ఖండించారు.

# మల్కపేటలో సుప్రీంకోర్టు జడ్జి

- చల్మెడ జానకీదేవి జ్ఞాపకార్థం నిర్మించిన బడి, గుడి సందర్శన

కోనరావుపేట, అక్టోబర్ 7 : చల్మెడ జానకీదేవి జ్ఞాపకార్థం న్యాయశాఖ మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు స్వగ్రామం మల్కపేటలో నిర్మించిన పాఠశాలను, సీతారామస్వామి ఆలయాన్ని సుప్రీంకోర్టు జడ్జి పులిగోరు వెంకట సంజయ్‌కుమార్ సోమవారం సందర్శించారు. ముందుగా గ్రామంలోని జానకీదేవి పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి, మల్కపేట రిజర్వాయర్ ప్యాకేజీ-9 బండ్-2 కట్టపై నిర్మించిన సీతారామస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా, అర్చకులు స్వామి ప్రసాదాన్ని అందజేసి, కండువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విశాలమైన వాతావరణంలో బడి, గుడి నిర్మించడం అభినందనీయమన్నారు. అత్యంత అద్భుతంగా ఆలయాన్ని నిర్మించారని కొనియాడారు. ఇక్కడ చల్మెడ మధుసూదన్‌రావు, అడ్వకేట్ రామారావు, శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆరె లతామహేందర్ ఉన్నారు.



మల్కపేటలోని శ్రీసీతారామస్వామి ఆలయ ఆవరణలో సుప్రీం కోర్టు జడ్జి పులిగోరు వెంకట సంజయ్‌కుమార్

# ఎములాడలో నేడే సద్దులు


- ముస్తాబైన మూలవాగు • అన్ని ఏర్పాట్లూ చేసిన యంత్రాంగం

వేములవాడ టౌన్, అక్టోబర్ 7: బతుకమ్మ వేడుకలకు రాజన్న క్షేత్రం సిద్ధమైంది. వేములవాడలో ఏడు రోజులకే సద్దుల నిర్వహించడం ఆనవాయితీ కాగా, నేడు నిర్వహించనున్న వేడుకలకు పురపాలిక యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మూలవాగును విద్యుద్దీపాలతో అలంకరించారు. పట్టణంలోని మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా కూడళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ తెప్పకు అందంగా రంగులు వేయడంతోపాటు మూలవాగు పరిసర ప్రాంతాలను జేసీబీతో చదును చేయించారు. బతుకమ్మ తెప్పవద్దకు వచ్చేందుకు మహిళలు ఇబ్బందులు పడకుండా సుభాష్‌నగర్లో బారికేడ్లను పెట్టారు. దాదాపు ₹30 లక్షల వ్యయంతో ఏర్పాట్లు చేస్తున్నట్టు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సంపత్‌రెడ్డి వెల్లడించారు. వేడుకలకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావుతోపాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నారని అధికారులు వెల్లడించారు.



బతుకమ్మ తెప్ప వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు, నాయకులు

## బంతి వనం.. బతుకమ్మకు సిద్ధం



కోనరావుపేట మండలం మామిడిపల్లి-హన్మాజీపేట గ్రామాల మధ్యలో ఓ రైతు బంతిపూల తోటను సాగు చేశాడు. పచ్చని పంటపొలాల మధ్య ఎరుపు, పసుపు రంగులతో పూలు విరబూశాయి. సద్దుల బతుకమ్మ సమీపిస్తున్న వేళ.. ఈ బంతి వనం.. రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులను ఆకట్టుకుంటున్నది. - కోనరావుపేట, అక్టోబర్ 7

# ఐదేండ్లకే ఆగిన ఊపిరి

- కొలిమికుంటలో హృదయ సంబంధిత వ్యాధితో చిన్నారి మృతి • తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు



అన్విక (ఫైల్)

చొప్పదండి, అక్టోబర్ 7: బుడిబుడి అడుగులు వేస్తూ స్కూల్‌కు వెళ్లాల్సిన ఓ చిన్నారి గుండె సంబంధిత వ్యాధితో మృత్యుఒడికి చేరింది. వివరాల్లోకి వెళ్తే.. చొప్పదండి మండలం కొలిమికుంటకు గ్రామానికి చెందిన పంజాల కొమురెల్లి పల్లవి దంపతులది పేద కుటుంబం. కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు అన్విక(5) గ్రామంలోని పాఠశాలలో ప్రాథమిక విద్య అభ్యసిస్తున్నది. మూడు నెలల క్రితం పాఠశాలకు వెళ్లిన చిన్నారి, తరగతి గదిలో పడిపోవడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. తర్వాత హైదరాబాద్ తీసుకెళ్లి పరీక్షలు చేయించగా, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్టు వైద్యులు గుర్తించారు. కూలీ పనిచేసే కొమురెల్లి తన బిడ్డను బతికించుకునేందుకు అప్పులు తెచ్చి చికిత్స చేయించాడు. గత నెల 24న అన్విక ఐదో పుట్టినరోజు వేడుకలు జరిపించాడు. అయితే ఆదివారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురైన అన్వికను సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్ దవాఖానకు తరలిస్తుండగా, గమ్యం చేరకముందే తుదిశ్వాస విడిచింది. బిడ్డను కాపాడుకునేందుకు దవాఖానల చుట్టూ తిరుగుతూ ₹10 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. చివరకు ఆ తల్లిదండ్రులకు శోకమే మిగిలింది.

# పెండింగ్ డీఏలు ప్రకటించాలి

**ప్రభుత్వ ఉద్యోగుల సహనాన్ని పరీక్షించద్దు**

- సమస్యల పరిష్కారం కోసం చర్చలకు ఆహ్వానించాలి • సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునురుద్ధరించాలి
- దసరా తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తాం
- ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్



మాట్లాడుతున్న టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్

కొత్తపల్లి, అక్టోబర్ 7 : ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కారం కాకుంటే దసరా తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి ఉద్యమిస్తామని ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ స్పష్టం చేశారు. ప్రభుత్వోద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలలో దసరాలోగా కనీసం మూడింటినైనా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం వెంటనే వారిని చర్చలకు పిలువాలని కోరారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో సోమవారం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఉద్యోగులకు సంబంధించిన వేతనాలు, ఇతర బిల్లుల చెల్లింపులను ఈ-కుబేర్‌తో కాకుండా జిల్లా ట్రెజరీల అందేలా చూడాలని, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సంబంధించిన బెనిఫిట్స్ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి సమర్థవంతంగా అమలు చేసేది ప్రభుత్వ ఉద్యోగులేనని, వారి సంక్షేమం చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లీవ్ సాలరీ, జీపీఎఫ్ లోన్లు, మెడికల్ బిల్లులు, లీవ్ ఇన్ క్యాష్ అసెస్మెంట్, బిల్డింగ్ లోన్‌లను వెంటనే చెల్లించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు బడ్జెట్ లేక, పెట్టిన బిల్లులు రాక అధికారుల ఒత్తిడితో తమ సొంత పైసలతో పనులు చేస్తున్నారని, వారికి బిల్లులు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దసరా, సద్దుల బతుకమ్మ సంబురాలకు పంచాయతీ కార్యదర్శులకు బడ్జెట్ కేటాయించాలని కోరారు. సమావేశంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, నాయకులు ముప్పిడి కిరణ్‌కుమార్, నాగుల నరసింహాస్వామి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, గంగారపు రమేశ్, సర్దార్ హర్మీందర్‌సింగ్, రాజేశ్ భరద్వాజ్, సబిత, విజయలక్ష్మి, ముల్కా రాజేశ్వరరావు, కోట రామస్వామి, పలు డిపార్ట్‌మెంట్‌ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.